# కే.పి.

సువర్ణ కుమార్

సెలవులకు ఊరొచ్చిన స్నేహితురాళ్లిద్దరూ ఎప్పటిలాగే ఆ డాబా మీద చేరారు.

ఎప్పుడూ గలగలమనే ఆ ఇద్దరి మధ్యా ఎడతెగని నిశ్శబ్దం ఆవరించింది.

ఏదో వెదుకుతున్నట్టు నేలచూపులతో చెరోవైపు కాళ్లీడ్చుకుంటూ పచార్లు చేస్తున్నారు. అక్కడక్కడా ఆగి పరిసరాల్లోకి నిస్సహాయంగా చూపు విసిరి మళ్లీ అదే వెదుకులాటలో పడుతున్నారు.

ఇద్దరిమధ్యా లిప్తపాటు చూపులు కలిసి విడిపోతున్నాయి.మాటలు అందక ఎవరికివారు మౌనంగా నవ్వుకొని ఊరుకుంటున్నారు.

నిశ్శబ్ధం ఆ ఇద్దరి మధ్యే.

పరిసరాలు మాత్రం జాతరను తలపించే ధ్వనులతో మార్మోగిపోతున్నాయి.

చుట్టూ ఒకటే కాకిగోల.

పక్కనున్న రావిచెట్టు మీద వందలాది కాకులు చేరి ఒకటే గోల చేస్తున్నాయి.

స్నేహితురాళ్లిద్దరూ మెల్లగా ఓ మూల చేరి ఆ రావిచెట్టు వైపు దృష్టి సారించారు.

ఆశ్చర్యం, తమ సంభాషణలకు ఎప్పుడూ అంతరాయం కలిగించే ఆ కాకిగోల ఇప్పుడు వాళ్ల చెవులకు ఎంతో శ్రావ్యంగా వినపడుతోంది. అదొక సమూహ సంగీతంలా ఉంది. పరవళ్లు తొక్కుతున్న ప్రవాహపు హోరులా ఉంది. నల్లని ఆ వికారపు పక్షుల గుంపు, అప్పుడే తవ్వకాల్లో బయటపడ్డ ఆదిమ సంస్కృతిలా వారికి సంభ్రమాశ్చర్యాలు కలిగిస్తున్నది.నల్లని ఆ(కా)కులు నిండిన ఆ రావిచెట్టు బుద్ధుడికి జ్ఞానబోధ చేసిన మహాబోధిలా కనిపిస్తున్నది.

ధైర్యం చేసి స్నేహితురాళ్లిద్దరూ మెల్లగా చూపులు కలిపి ఒకరినొకరు సూటిగా చూసుకున్నారు. చేతులు కలిపి గాఢంగా నొక్కుకున్నారు. పెద్ద నవ్వుతో నిట్టూర్చి హృదయ భారానికి తలుపులు తెరిచారు.

'కె.పి.' బిగ్గరగా అంది ఇందిర

జరీనా కూడా 'కె.పి.'అంటూ అదే స్థాయిలో వంత పాడింది.

** ** **

ఇందిర, జరీనా.

వారి స్నేహం ఈనాటిది కాదు.

పదేళ్లకు పైమాటే. ఐదో తరగతిలో, ఇందిర వాళ్లు ఈ ఊరొచ్చిన నాటి నుంచీ ఆ స్నేహం కొనసాగుతోంది. వారి సామాజిక హోదా, ఆర్థిక స్థితిగతులు పునాది వేసినా; అభిరుచుల్లో సామీప్యతే వారి స్నేహాన్ని ఇంతకాలం నిలిపింది. ఇప్పుడు ఇద్దరూ యూనివర్సిటీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తున్నారు. అక్కడే హాస్టల్లో ఉంటున్నారు. సెలవుల్లో ఇద్దరూ కలసే ఊరొస్తారు. కలసే తిరిగి వెళతారు.

ఇక్కడ ఉన్నన్ని రోజులూ ఇలా ప్రతి సాయంకాలం ఇందిరవాళ్ల అద్దెఇంటి డాబా మీద కలుసుకోవడం వారికో వ్యసనం. ఏదో ఒక అంశం మీద గంటల తరబడి చర్చించుకుంటారు. పెద్దగా వాదోపవాదాలేవీ లేకుండానే రాజీలతో సర్దుకుపోతుంటారు. ఏకాభిప్రాయం సాధ్యపడని రోజు చర్చను మరుసటి రోజుకు వాయిదా వేసుకుంటారు. చివరికి ఏవో సత్యాలను కనుగొన్నామన్న తృప్తితో పరస్పరం అభినందించుకుంటూ ముందుకు సాగుతారు.

సినిమా హీరోల గురించీ, డ్రస్సుల గురించీ, ఫ్యాషన్ల గురించీ మదనపడేంత అదృష్టానికి వాళ్లు నోచుకోలేదు. అంత ఖరీదైన కలలుగనే కొనుగోలు శక్తి కూడా లేదు వాళ్లకు. దారితప్పిన బాపతు వాళ్లు. ఇప్పుడిప్పుడే ప్రపంచానికి కళ్లు తెరుస్తున్న ఉత్సాహవంతులు వాళ్లు. యూనివర్సిటీలో చేరాక ఈ ప్రపంచం మరింత విశాలమైంది. చిక్కపడింది. చిక్కుముడులు వేసింది.

** ** **

'నేనిప్పటికీ ఆ షాక్ నుంచి తేరుకోలేక పోతున్నా' అంది ఇందిర బలవంతాన తెచ్చిపెట్టుకున్న ఉత్సాహంతో ప్రశాంతంగా నవ్వుతూ.

'నాకైతే కాళ్ల కింద భూమి కదిలిపోయిందనుకో' అంటూ చలాన్ని కోట్ చేసింది జరీనా.

రెండ్రోజుల క్రితం హాస్టల్లో జరిగిన సంఘటనను ఇద్దరూ నెమరువేసుకున్నారు. ఇంతసేపూ తమను పట్టి ఊపిన ఆ ఘటనను పూసగుచ్చినట్టు గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నించారు.

** ** **

భావి పౌరులను తీర్చిదిద్దే మన కాలేజీలు, యూనివర్సిటీలు పైకి కనిపించేంత అందమైనవి కావని అక్కడ కాలుపెడితేగానీ బోధపడదు. మిగిలిన సమాజంలో ఉన్న కల్మషమంతా అక్కడ కూడా నిక్షేపంగా దర్శనమిస్తుంది. కుల కుతంత్రాలు, మత విద్వేషాలు, వాటిని పెనవేసుకున్న రాజకీయాలు నగ్నంగా నర్తిస్తుంటాయి. సప్త సముద్రాలు దాటొచ్చిన గ్లోబల్ నాగరికత ఈ నర్తనాలకు సరికొత్త బాణీలు సమకూరుస్తుంది. వెరసి అదొక పంచరంగుల సినిమాలా ఉంటుంది.

శిబిరాలుగా చీలిపోకుండా ఎవరూ అతీతంగా ఉండలేని అనివార్యత అక్కడ నిత్యం వెంటాడుతుంది. అలా అతీతంగా ఉండగలమని లేదా ఉన్నామని ఎవరన్నా భ్రమించినా, ఏదో ఒక శిబిరంలో ఆపాటికే వారి సభ్యత్వం నమోదై ఉంటుంది. ఇంకా అటువంటి మర్యాదస్తులు ఎవరైనా మిగిలివుంటే,ఆ సాయంకాలం వారి భ్రమలన్నీ పటాపంచలై ఉండి తీరాలి.



ఏటా జరిగినట్టే ఫైనలియర్ పూర్తయిన సీనియర్ల కోసం హాస్టల్లో ఆ సాయంకాలం ఫేర్‌వెల్ పార్టీ ఏర్పాటైంది. ఈ ఏడాది మరో విశేషం కూడా ఆ పార్టీ ప్రాధాన్యాన్ని పెంచింది. సివిల్స్‌కు సెలక్టయిన మరో ఇద్దరు అమ్మాయిలను అభినందించే కార్యక్రమాన్ని కూడా ఆ పార్టీలోనే చేర్చారు. దాంతో ఆ పార్టీకి ఐఎఎస్ కళ వచ్చింది. ఖరీదైన, ఆకర్షణీయమైన విందుకూడా సిద్ధమయింది. సమావేశానికి, ప్రసంగాలకు హాస్టల్ పైభాగాన వేదిక కూడా ఏర్పాటు చేశారు.

ముందుగా సివిల్స్‌కు సెలక్టయిన అమ్మాయిలు రాజేశ్వరి, విజయలక్ష్మిని అభినందించే కార్యక్రమం చేపట్టారు. వారి విజయ రహస్యాలను వారి నోటే పలికించారు. అందరూ వారితో కరచాలనం చేస్తూ కంగ్రాట్స్ చెప్పారు. హాస్టల్లోని వారే కాకుండా బయట నుంచి కూడా కొందరమ్మాయిలు వారిద్దరినీ అభినందించడానికి వచ్చారు. కొందరు ఏవో చిన్న చిన్న కానుకలు కూడా అందజేశారు.

ఈ రెండు కార్యక్రమాలను నిర్వహించే బాధ్యత చేపట్టిన శిరీష ఉత్సాహంగా కలియతిరుగుతూ అందరినీ ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. వేదికమీద కూడా అంతా తానై వ్యవహరించసాగింది. ఆనాటి సభకు ఆమే అధ్యక్షురాలు.

సివిల్స్ విజేతల సందడి సద్దుమణగగానే ఫేర్‌వెల్ పార్టీ మొదలైంది.

మాట్లాడవలసిన వాళ్ల పేర్లు ఒక్కొక్కటిగా పిలుస్తూ వారిని వేదిక మీదకు ఆహ్వానించింది శిరీష. వచ్చిన వాళ్లు తమ హాస్టల్ అనుభవాలను, అక్కడే పుట్టి పెరిగిన మధురమైన స్నేహానుబంధాలను గుర్తుచేస్తూ విడిపోతున్నందుకు ఎంతో బాధపడ్డారు. ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయినా ఈ స్నేహాలు కలకాలం కొనసాగాలని కొందరు కాంక్షించారు. ఉత్తరాలు రాసుకోవాలని, ఫోన్లు చేసుకోవాలని, ఇంటర్నెట్‌లో కలుసుకోవాలని బాసలు చేసుకున్నారు. కొందరు ముక్తసరిగా ఏవో నాలుగు ముక్కలు మాట్లాడి దిగిపోయారు.

*జలపాతంలా హోరెత్తిన మైత్రేయ శిరీష వైపు తిరిగి జాలితో కూడిన ఒక నిర్లక్ష్యపు నవ్వువిసిరి రివ్వున వేదిక దిగి బయటకు వెళ్లిపోయింది. ఆమెను ఆపడానికిగానీ, పలకరించడానికిగానీ ఎవరూ సాహసించలేకపోయారు*

శిరీష జాబితాలో మైత్రేయ వంతువచ్చింది.

'ఇప్పుడు విదార్థి నాయకురాలు కె.పి.మైత్రేయ తన అమూల్య సందేశం ఇస్తారు' అంటూ 'కె.పి.'అన్నచోట వ్యంగ్యంగా నొక్కిపలుకుతూ ఆహ్వానించింది శిరీష.

అమ్మాయిల్లో ఒకవైపున ఉన్న వారు విరగబడి నవ్వారు. శిరీష సాహసానికి వాళ్లంతా అబ్బురపడ్డారు. వాళ్లు అలా ఎందుకు నవ్వారో అక్కడున్న చాలా మందికి అర్థం కాలేదు.

నల్లగా, పీలగా, నిటారుగా మగాడిలా అడుగులేస్తున్న మైత్రేయ రివ్వున వేదికమీదకు చేరింది. కేంపస్‌లో ఏ ఆందోళన జరిగినా, హాస్టల్లో ఏ సమస్య వచ్చినా ముందుండే మైత్రేయ అక్కడున్న వారందరికీ సుపరిచితమే. కొందరికి ఆప్త మిత్రురాలు. ఓ విద్యార్థి సంఘంలో ఆమె నాయకురాలు కూడా.

అంత క్రితం విరగబడి నవ్విన అమ్మాయిలు ఇంకా ఏదో గుసగుసలాడుతూ నవ్వుకుంటూనే ఉన్నారు. వేదికపై మైత్రేయ పక్కనే నిలబడిఉన్న శిరీష ముఖంలో కూడా ఒక క్రూరమైన నవ్వు తాండవిస్తోంది.

మైత్రేయ పెదవి విప్పింది.

తన ఇంటిపేరును కనిపెట్టి చక్కగా ఉచ్చరించిన శిరీషకు ముందుగా కృతజ్ఞతలు చెప్పాలంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించింది.

ఊహించని ఈ పరిణామానికి శిరీష ఉలిక్కిపడింది. పక్కలో బల్లెం దిగబడ్డట్టు వెనక్కు తూలింది. ఒంట్లో నెత్తురుచుక్క లేదు. తేలుకుట్టిన దొంగలా బిగుసుకుపోయింది. ఆమె చెలికత్తెలు అవాక్కయి నవ్వులు కట్టిపెట్టారు. చాటుగా చెవులు కొరుక్కోవడం ప్రారంభించారు.

మైత్రేయ మాట్లాడుతోంది,

"నా ఇంటిపేరు కె.పి. అట. అంటే కాకి పిల్ల. నల్లగా, అందవికారంగా ఉంటాను కదా, తగిన పేరే పెట్టారు. అప్పుడప్పుడూ మరీ ముద్దొస్తానేమో, ఎం.కె. అని కూడా అంటుంటారు. అంటే మాల కాకి. ఇక్కడ నా కులాన్ని కూడా కలిపారు. ఇది కూడా చక్కని గుర్తింపే. ఇలా తాటాకులు కట్టించుకోవడం మాకు కొత్తేమీ కాదు. వాడ నుంచి వర్సిటీ దాకా ఇటువంటి అవమానాలను ఎన్నో చూశాం. మా వెనక జరగుతున్న కుట్రలు, వెంటాడుతున్న అవమానాల గురించి తెలియని అమాయకులమేమీ కాము. తెలియదనుకోవడం మీ ఖర్మ. నిలువెత్తు కల్మషంలో కూరుకుపోయిన మీ అహంకారాలను, అజ్ఞానాన్ని చూసి జాలిపడుతున్నాను.

"నా రంగుని, కులాన్ని మీరెప్పటికీ జీర్ణించుకోలేరు. మీరింకా వర్ణాశ్రమాల్లోనే ఊరేగుతున్నారు. నలుపు నా శరీరంమీద లేదు. మీ కళ్లనిండా ఉంది. గాఢాంధకారం మీకు చూపు లేకుండా చేసింది. మీకు అంధ(ద) నిర్వచనాలు నేర్పింది. మీ కులాలు, మీ మతాలు ఈ చీకటి గంతల్ని విప్పనివ్వవు. శాశ్వతం చేస్తాయి. పాండురోగం సోకిన మీ మనసులకు మా రంగులన్నీ అంటరానివే. మీరెన్ని చిలక పలుకులు నేర్చినా మీ బుద్ధులు ఎన్నటికీ మారవు. మీ తండ్రులు కమ్యూనిస్టులైనా, మీ అన్నలు నక్సలైట్లయినా, మీ తల్లులు ఫెమినిస్టులైనా ఈ బుద్ధులు పదిలంగానే ఉంటాయి. శ్వేత స్వప్నాల్లో మునిగితేలే మీకు ఎన్నిచెప్పినా అదంతా కాకిగోలగానే ఉంటుంది. మీ బతుకులిట్టా తెల్లారిపోవాల్సిందే.




"ఒకసారి మీ ముఖాలకు నల్లరంగు పులుముకొని అద్దంలో చూసుకోండి. జడుసుకొని చస్తారు. మీరెంత దుర్బలులో అప్పుడైనా బోధపడుతుందేమో. పాతాళంలోకి పాతుకుపోయిన మీ మూలాలను ఒకసారి తవ్విపోసుకోండి మీరెంత పతనమయ్యారో తెలుస్తుంది..."

అవేశంతో ఊగిపోయింది మైత్రేయ.

అక్కడున్న వారంతా ప్రతిమల్లా నిల్చుండిపోయారు. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ వెనుక నిలబడ్డ వారిలో ఒకరిద్దరు మైత్రేయను అభినందిస్తున్నట్టు గట్టిగా చప్పట్లు కొట్టారు. ఆ ధ్వనికి అంతా ఉలిక్కిపడ్డారు.

జలపాతంలా హోరెత్తిన మైత్రేయ శిరీష వైపు తిరిగి జాలితో కూడిన ఒక నిర్లక్ష్యపు నవ్వు విసిరి రివ్వున వేదిక దిగి బయటకు వెళ్లిపోయింది. ఆమెను ఆపడానికిగానీ, పలకరించడానికిగానీ ఎవరూ సాహసించలేకపోయారు. కాసేపాగి అందరూ అదే విషయమై బిగ్గరగా చర్చించుకోవడం ప్రారంభించారు.



మైత్రేయ మరీ సెన్సిటివ్ అన్నారు కొందరు.

అంత సీరియస్‌గా రియాక్ట్ కాకుండా ఉండాల్సిందన్నారు మరి కొందరు.

పార్టీ మూడంతా అప్‌సెట్ అయిందంటూ కొందరు శిరీషను తిట్టుకున్నారు.

నలుగురిలో ఇరుకునపడ్డందుకు కలిగిన స్వల్పఅసౌకర్యం తప్ప పశ్చాత్తాపం అణుమాత్రమైనాలేని శిరీష మెల్లగా తన బృందంలో చేరింది. తమ కోడ్ భాష మైత్రేయకు ఎలా తెలిసిందంటూ వాకబు చేయడం ప్రారంభించింది.

'టేకిట్ ఈజీ' అంటూ కొందరు శిరీషను ఇంగ్లీషులో సముదాయించారు.

అందరి దృష్టి తమవైపే ఉండటంతో లేని ఉత్సాహాన్ని నటిస్తూ శిరీష తన బృందంతో భోజనాలు సిద్ధంచేసి ఉన్న వైపు కదిలింది.

కొందరు భోజనాలు చేయకుండానే కిందకు వెళ్లిపోయారు. వారిలో ఇందిర, జరీనా కూడా ఉన్నారు.

** ** **

స్నేహితురాళ్లిద్దరూ ఓ మూల గోడకు సాగిలపడి ఇంకా చర్చించుకుంటూనే ఉన్నారు. అలసటతో అసహనంగా అటు ఇటూ కదులుతున్నారు.

'ఇందులో చాలా కొత్త విషయాలున్నాయి. ప్రశ్నలూ ఉన్నాయి. ఇప్పట్లో తేలే సమస్య కాదిది' అంటూ జరీనా లేచి నిలబడి తన చేతి వాచీ వంక చూసుకుంది. అప్పటికే రాత్రి తొమ్మిదైంది.

ఇందిర కూడా ఇక ·వెళదామన్నట్టు లేచి తన వాచీ వంక చూసుకుంది. అప్రయత్నంగా ఇద్దరూ ఒకసారి కాకులు చేరిన ఆ రావిచెట్టువైపు చూశారు. హోరెత్తించిన ఆ సమూహ గానం, ప్రవాహపు హోరు విశ్రాంతి తీసుకుంటోంది. మహాబోధిని అంటిపెట్టుకొని నల్లని కాకులన్నీ ఆ రాత్రి కలలుగంటున్నాయి.

■